# రేపటి ఉదయం

నందం రామారావు

ఈ కథకు—
గంటలూ, తేదీలూ,
రోజులూ లేవు!
వున్నదల్లా ఓట్లే!

* * *

సమయం తెలియదు.
పగలా? రాత్రా?
అంతకంటే తెలియదు!
మరేం తెలుసు?
నాకేం తెలుసో నీ కెందుకు?
మరి, మరెక్కడి కెడుతున్నారు?
ఎక్కడికా?
రా. చూద్దువుగానీ

అక్కడ, ఆ గదిలో అంతా చీకటిగా వుంది.

ఎక్కడ ఏం వుందో తెలియడం లేదు. ఐనా, ఆ గదంతా సువాసనలతో మత్తు మత్తుగా వుంది.

ఆ గదిలోకి ఒక్కొక్కరే అడుగు పెట్టడం తరువాయి అంతా తెలిసిపోయినట్టే వుంటుంది!

బయట పెద్ద క్యూ నిలబడి వుంది

అందరూ, తలో విధంగా వుండి, వివిధ భాషల్లో మాట్లాడుకుంటున్నారు.

ఎవరెవరు, ఎందుకు, ఏం మాట్లాడుకున్నారో తెలియడం లేదు. ఐనా, మాట్లాడుతూనే వున్నారు. మధ్యమధ్య ఆ చీకటి గది వేపు దృష్టి నిలుపుతూనే వున్నారు.

అక్కడున్న అందరికీ వరుసగా నెంబర్లు తగిలించి వున్నాయి. ఒకటీ.... రెండూ ... మూడూ.... ఇలా.

ఇంతలో, ఎక్కడినుంచో, బహుశా, ఆ గదిలోనుంచి కావచ్చు గంభీరంగా మాటలు వినిపించ సాగాయి.

అందరూ నిశ్శబ్దంగా వినసాగారు.

ఎవరికివారు బుద్ధిమంతుల్లా నిలబడి తల లూప సాగారు.

"యస్. నెంబర్ వన్. ఇప్పుడు మీరు లోపలి కెళ్ళవొచ్చు."

ఆ నెంబర్ వన్ లోపలికి పిలుపు రావడమే గొప్ప వండు గన్నట్టుగా గర్వంగా లోపలికి అడుగు పెట్టాడు.

ఆ చీకటి గదిలో ఎవరూ లేరు!
చుట్టూ చూశాడు.
ఎవరూ కనిపించలేదు.
గొంతెత్తి పిలుద్దా మనుకున్నాడు.
నోరు పెగల్లేదు.
కాళ్ళు కదల్లేదు!
కొన్ని క్షణాలు గడిచాయి.

ఇంతలో, ఆకాశవాణి నుంచి ఎవరో మాట్లాడుతున్నట్టుగా వినిపించింది.

"నీ పేరు?"

"నెంబర్ వన్."

"ఏం చేస్తుంటావ్?"

"ఐదొందల ఎకరాల పొలం వుంది. దాని మీద వొచ్చే రాబడితో ఏం చెయ్యాలో తోచక రాజకీయాల్లోకి దిగాను. తద్వారా దేశసేవ చెయ్యాలనుకుంటున్నాను. మీరు గనుక సీటు యిస్తే సునాయాసంగా గెలుస్తాను."

"ఇంకా నీ అర్హత లేవిటి?"

"మీరు గనుక దయతలిస్తే అర్హత సంపాదిస్తాను."

"సరే, ఇక నువ్వెళ్ళొచ్చు."

"మరి, నా సీటు సంగతి ..."

"సీటు నీకే-వెళ్ళి మన పార్టీ తరఫున ప్రచారం చెయ్యి."

"చిత్తం."

నెంబర్ వన్ నిష్క్రమించాడు. నెంబర్ వన్ నిష్క్రమించిన మరుక్షణంలో నెంబరు రెండు ప్రవేశం—

"ఏవిటి నీ అర్హతలు?"

"క్రితం సారి ఎలక్షన్‌లో నిలబడి, గెలిచి అనుభవం సంపాదించాను దాదాపు పది లక్షలు సంపాదించాను."

"ఇంకా?"

నెంబర్ టూ అటూ ఇటూ చూసి మాట్లాడకుండా వూరుకుండి పోయాడు.

"ఏం మాట్లాడవ్?"

"ప్రత్యర్థి వర్గాలను నా వేపు త్రిప్పుకోవడానికి అనేకం చేయరాని పనులు చేశాను."

"శభాష్, ఈ సీటు నీకే. వెళ్ళు. వెళ్ళి ప్రచారం మొదలుపెట్టు."

"నెంబర్ త్రీ!"

ఒక్క క్షణం. అమ్మయ్యా లోపలకొచ్చాడు.

"నా పేరు నెంబర్ త్రీ! నిజాయితీగా బ్రతుకుతున్నాను. ఆనాడు దేశ స్వాతంత్ర్యంకోసం జైలుకెళ్ళాను. లాటీ దెబ్బలు తిన్నాను. వున్న లక్షలాది రూపాయలు దేశం కోసం ఖర్చుపెట్టాను. ఐనా నాలో దేశానికి ఇంకా ఏదో చెయ్యాలనే ఆశ చావ లేదు...."

"ఊ ఐతే."

"నిజాయితీపరుడుగా, నిష్కళంక వ్యక్తిగా నాకు ప్రజల్లో పేరుంది. కావాలంటే మీరు నా గురించి వాకబు చేసుకోవొచ్చు. నా నిజాయితీని గుర్తించి నాకు సీటు ఇప్పించండి."

నవ్వు!

"ఇక మీరు వెళ్ళవొచ్చు."

"మరి, నాకు సీటు."

"మీరు వెళ్ళవొచ్చనంటున్నాం."

వరుసగా చాలా నెంబర్లని ఇంటర్వ్యూ చెయ్యడం జరిగింది. ఐనా, ఇంకా నెంబరు బయట పెరుగుతూనే వుంది.

నెంబరు నూట ఇరవై నిలబడి చెబుతున్నాడు—

"ఈ సీటు నాకిస్తే చాలా సునాయాసంగా గెలుస్తాను. ఓటుని రెండువందలిచ్చికొనగల స్తోమత వుందినాకు. అదీగాక, సారా కాంట్రాక్టులు చేసి కోట్లు సంపా




దించాను. నా సీటుతో పాటు మరో అర డజను సీట్లు మనవి గెలిపించగలను."

"చాలా సంతోషం. ఇటువంటి వారే మనకా్కవలసింది."

పొగడ్తలు. స్తోత్రాలు.

"నా నెంబరు రెండు వందలు. గత




పాతిక సంవత్సరాల నుంచీ ఈ సీటునే అంటిపెట్టుకుని వున్నాను. ఈ సారి మా అల్లుడికి్కూడా సీటు ఇప్పించండి. ఈ రెండు సీట్లు గొప్ప మెజారిటీతో గెలవడమే కాకుండా అవతల అభ్యర్థికి డిపాజిట్లు కూడా రాకుండా చెయ్యగలను."

"ఎలా.... ?"

చిరునవ్వు

"బాలెట్ పెట్టెల దగ్గర మన మనుషులే వుంటారు. ప్రత్యర్థి మనుషుల్ని సంవత్సరం క్రితమే కొన్ని లక్షలు పెట్టి కొనేశాను. అదీగాక ప్రత్యర్థి వర్గానికి నా పేరు చెబితే సింహస్వప్నం."

"ఎందుకని?"

మౌనం.

"పరవాలేదు చెప్పు."

"వాళ్ళ మనుషుల్ని అయిదుగుర్ని హత్య చేయించాను."

"వెరీ గూడ్."

"ఎలక్షన్‌లో గెలవడానికి అన్ని హంగులు తెలుసుకున్న జ్ఞానివి. నీకు ఓటమనేది తెలియదు. నీకు జయమగుగాక!"

జయహో! జయహో!

* * *

ఎన్నికలు!

అలజడి.

పుద్రిక్తత.

మంటలు.

హత్యలు.

రెండు మూడు చోట్ల మానభంగాలు.

కాల్పులు.

ఐనా—

పరిస్థితి ప్రశాంతంగానే వుంది.

క్రితంసారి ఎన్నికలకంటే. ఈసారి గణనీయంగా ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు!

భళీ! ప్రజల్లో రాజకీయ చైతన్యం మేల్కొంది.

అంతకంటే ఇంకేం కావాలి?

ఫలితాలు తెలిశాయి.

షరా మామూలే!

* * *

సారా పీపాలూ,

బరిసెలూ,

భూ కామందులూ,

ప్రజా బంధువులూ,

అందరూ చాలా ఆనందంగా ఒకేచోట కలుసుకున్నారు.

ఎవరెవరు ఎంతెంత ఖర్చు పెట్టిందీ ఎవరెవరు ఏం చేసిందీ, ఎవరు ఎవరెవర్ని ఏం చేయించిందీ తెలుసుకున్నారు.

గొప్పవాళ్ళమని పొంగిపోయారు.

చాలా సంతోషం.

అదేగదా కావలసింది.

గొప్పవాళ్ళకు జిందాబాద్!

అసలు కథ ఇప్పుడే మొదలయింది.

పదవులకోసం!

పెదవుల కంటే

రుచికరమైనవి

పదవులు!

పదవులంటే—

సుకుమారమైన పెదవులూ పొందవొచ్చు!

ఇష్టం వచ్చినట్టు పెదవులూ కదపవొచ్చు!

అందుకే—

ఆ పదవులు తమ కా్కవాలంటే తమ కా్కవాలని వాదాలు పెంచుకున్నారు.

గంటలూ, రోజులూ చర్చలూ, రాయబారాలూ జరిగాయి.

ఎట్టకేలకు ఒక అంగీకారం కుదిరింది. అసంతృప్తితోనే!

* * *

ఎంతకాలమైందో తెలియదుగానీ, అధికారంతో ఐశ్వర్యాలు అనుభవిస్తున్న వారికి కాలం తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు!

ఐతే, అనుభవించే వారిలోనే అసూయ కూడా ఎక్కువ దాగి వుంటుందేమో!

మళ్ళా, అందరూ ఒకచోట చేరారు.

ఆ భవంతిలోపల అతిదారుణమైననిశ్శబ్దం ఆవరించి వుంది. అక్కడ కూర్చున్న వారి ముఖాల్లో దైన్యం, ఆందోళన, విచారం గూడు కట్టుకుని వున్నాయి!

కోట్లు సంపాదించినవారూ,

హత్యలు చేయించినవారూ,

జగడాలు సృష్టించినవారూ,

అందరూ అక్కడ వున్నారు!

ఐనా, ఎవరికీ మాట పెగలడంలేదు.

బయట—

ఆ భవంతిచుట్టూ జనం గుమిగూడి ఏకకంఠంతో అరుస్తున్నారు.

వాళ్ళ అరుపుల్లో—

కోపం వుంది.

క్రోధం వుంది.

జాలి వుంది!

నిముషాలూ, గంటలూ గడుస్తున్నాయి.

నెమ్మది నెమ్మదిగా ఆ భవంతి తాలూకు గోడలు బీటలువారుతున్నాయి!

బీటలు వారుతున్న ఆ పునాదుల నుంచి ఏ శక్తి ఎప్పుడు పుట్టుకొస్తుందో తెలియదు.

అంతవరకూ—

ఆ భవంతి చుట్టూ హాహాకారాలు మిన్నుముట్టుతూనే వుంటాయి!